క్లుప్తంగా

ఈ-కేవైసీ చేయించుకోండి

గోనెగండ్ల: రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత రైతులకు సూచించారు. వారు శుక్రవారం మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు – 1, 2లను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి ఈ-కేవైసీ వివరాలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు ఈ-కేవైసీ (వేలిముద్రల నమోదు) 91 శాతం పూర్తయిందని తెలిపారు. రైతులందరూ ఈనెల 22వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. సిబ్బంది స్వామి, అనూష తదితరులు పాల్గొన్నారు.

147 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలు

చిప్పగిరి: మండలంలో 147 మంది వలంటీర్లు వివిధ సేవా పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ బరెన్‌సాహెబ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఐదుగురు గ్రామ వలంటీర్లకు సేవా రత్న, 142 మందికి సేవా మిత్ర పురస్కారాలు దక్కాయని, సేవా రత్నకు రూ 30 వేలు, సేవా మిత్రలకు రూ.15 వేలు నగదు బహుమతితో పాటు వారం రోజుల పాటు ఆయా గ్రామ సచివాలయాల్లో సత్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా నంది ఉత్సవం



హొళగుంద తేరువీధిలో ఉచ్చాయాన్ని లాగుతున్న భక్తులు

హొళగుంద: సిద్దేశ్వరస్వామి జాతర పురస్కరించుకుని శుక్రవారం రాత్రి హొళగుందలో నంది ఉత్సవం ఘనంగా జరిగింది. ఉచ్చాయంలో ప్రతిష్టించిన నంది విగ్రహంపై సిద్ధప్ప, సిద్ధమ్మ ఉత్సవమూర్తులనుంచి పూజారులు మహామంగళారతి, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్థానిక తేరు బజారులో ఉచ్చాయాన్ని ఎదురు బసవన్న గుడి వరకు లాగారు. జాతరలో భాగంగా రథోత్సవానికి ముందు రెండు రోజులు ఉచ్చాయాలను లాగుతారు. ఆలయ ధర్మకర్తలు రాజపంపన్నగౌడ్, శివన్నగౌడ్, సిద్ధార్థగౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ఆసరా సంబరాలు

నందవరం: మండల కేంద్రంలోని సచివాలయం-1 ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు, వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హాజరవుతారని వెల్లడించారు. మండల అధికారులు, వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు తప్పని సరి హాజరు కావాలని కోరారు. అలాగే పొదుపు మహిళలు హాజరై ఆసరా సంబరాలు విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరు



సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలపై పోరు బాట తప్పదని పలు వామపక్ష పార్టీల నాయకులు రామాంజినేయులు, గోవిందు, రాముడు, తిమ్మగురుడు, వీరేష్, హనుమంతు పేర్కొన్నారు. శుక్రవారం ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం హైవేపై రాస్తారోకో చేశారు. ర్యాలీగా సోమప్ప సర్కిల్‌కు వరకు వెళ్లి అక్కడ ధర్నా చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం 'హొళగుంద సిద్దేశ్వరస్వామి'

హొళగుంద: కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న హొళగుంద సిద్దేశ్వర స్వామి జాతర మూడు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం కంకణ ధారణ నిర్వహించనున్నారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే గాక కర్ణాటక, ఇతర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

ఉత్సవ వివరాలు

ఇప్పటికే ఈ నెల 13న కంకణధారణ, 16న నంది ఉచ్చాయాలు జరిగాయి. 17న గజోత్సవం, 18న రథోత్సవం, 19న లంకాదహనం, 20న వసంతోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజపంపన్నగౌడ్, శివన్నగౌడ, సిద్ధార్థగౌడ్ తెలిపారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న గడినాడ కన్నడ కళా యువ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కళాకారులతో ' రైత అచ్చిద రక్త సిందూరా' అనే కన్నడ సామాజిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. అంతకుముందు రోజు 18న వీర అభిమాన్యు కాళగ, 20న కర్ణార్జునర కాళగ బయలు నాటకాలు ప్రదర్శించనున్నారు. ఉత్సవాల్లో రూ.లక్షలు విలువ చేసే రకరకాల బాణసంచా కాలుస్తారు.



మద్దికెర సమీపంలో భూసార పరీక్షలు చేస్తున్న సిబ్బంది



బొజ్జనాయినిపేట వద్ద ఈ - క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



ఎం.అగ్రహారంలో సబ్సిడీ ట్రాక్టర్ అందజేస్తున్న దృశ్యం



టీడీపీ హయాంలో విత్తనాల కోసం మద్దికెర సహకార సంఘం కార్యాలయం వద్ద పాసుబుక్‌లను వరుసలో ఉంచి రైతన్నల అవస్థలు

రైతుకు భరోసా

- అన్నదాతకు అండగా రైతు భరోసా కేంద్రాలు
- రైతులకు తప్పిన విత్తన కష్టాలు
- గ్రామాల్లోనే పంపిణీ
- పంట దిగుబడులు సైతం కొనుగోలు
- పంటల సాగులో చేయిపట్టి నడిపిస్తున్న ప్రభుత్వం

వ్యవసాయ రంగంలో అడుగడుగునా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోంది. గ్రామస్థాయిలో ఆర్బీకేలను ఏర్పాటు చేసి భూసార పరీక్షల నుంచి పంట దిగుబడులను విక్రయించే వరకు అన్ని రకాలుగా చేదోడుగా ఉండేలా సిబ్బందిని నియమించింది. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేస్తుండటంతో అన్నదాతలకు అవస్థలు తప్పాయి. పంటల సాగులో సలహాలిస్తూ, దిగుబడులను సైతం మద్దతు ధరకు అక్కడే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. ఇక ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే పరిహారం మంజూరులో ఆర్బీకేలు కీలకపాత్ర పోషిస్తున్నాయి.



మద్దికెర ఆర్బీకేలో గతేడాది రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర : నాడు..రైతులు విత్తనాలు, ఎరువులు కోసం రోజుల తరబడి వ్యయ ప్రయాసలకోర్చి పట్టణాల్లోని వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. చివరికి అవి అందకపోతుండటంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయేవారు. ఆరుగాలం పండించిన పంటకు మద్దతు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూసేవారు. సాగులేక అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవారు. ప్రభుత్వం పట్టించకోకపోవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే..వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చేశారు. భూసార పరీక్షల నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు అండగా నిలుస్తున్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు రైతు భరోసా కేంద్రాలను నిర్మించి గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారు. పంట కొనుగోలు చేస్తుండడంతో వారికి అవస్థలు తప్పడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సేవలిలా..

→ మండలంలోని 9 సచివాలయాలకు గాను ఒక్కొక్క ఆర్బీకే రూ.23.94 లక్షలతో 9 ఆర్బీకేలను రూ.2.16 కోట్లతో నిర్మించారు.

→ ఆర్బీకేల ద్వారా ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,050 క్వింటాళ్లు, రబీ సీజన్‌లో 3900 క్వింటాళ్ల 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేశారు.

→ ఆర్బీకేల ద్వారా గతేడాది జీవ ఎరువులు 2వేల క్వింటాళ్లు, 2002లో 1500 క్వింటాళ్లు విక్రయించారు.

→ రైతుభరోసా, పీఎం కిసాన్, పొలం బడి, యంత్రాలు, ఈ-కేవైసీ, ఈక్రాప్ బుకింగ్‌తో పాటు దాదాపు 20 రకాల సేవలు అందిస్తున్నారు.

→ విత్తన నాణ్యతను పరిశీలించి జెర్మింగ్ ప్రక్రియ ద్వారా వినియోగంపై సలహాలు ఇస్తున్నారు.

→ భూసార పరీక్షలు చేసి ఫలితాలు అందజేసి ఏ పంట సాగు చేయాలని, వాడాల్సిన ఎరువులు, మందులు తదితర వాటిని వివరిస్తున్నారు.

→ దిగుబడులను విక్రయించేందుకు మద్దతుధర, దేశంలో ఏ ప్రాంతంలో ఎంత ధర ఉందో తెలుసుకునే వీలు

→ పంటల దిగుబడులను ప్రభుత్వం నిర్దేశించిన ధరకు కొనుగోలు చేయడం

→ పంటలు నష్టపోతే అంచనా వేసి నివేదికలు రూపొందించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధితులకు పరిహారం పంపిణీ చేస్తున్నారు.

→ తమ నేలల్లో ఎలాంటి పంటలు సాగు చేయాలో తెలుసుకోవడానికి ఆధునిక లైబ్రరీ ఏర్పాటు

→ మందులను సొంతంగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం.

మండలంలో 7,500 మంది రైతులకు ఏడాదికి రూ.5.68 కోట్ల ప్రకారం ఐదేళ్లకు రూ.28.42 కోట్లు అన్నదాతలకు వివిధ సంక్షేమ పథకాల కింద అందజేశారు. మండలంలో ఆరు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ పంపిణీ చేశారు. 9 ఆర్బీకేల్లో ఏడు మంది వీఏఏలు, 3 ఎంపీఈఓలు, ఒక ఏఈఓ, ఒక ఏఓ రైతులకు సేవలందిస్తూ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను అందజేస్తున్నారు.



బసినేపల్లి రైతు భరోసా కేంద్రం

ఆర్బీకేలతో ఎంతో మేలు



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి 16 కి.మీ దూరం. గతంలో ఏటా విత్తనాల కోసం పట్టణాలకు రోజుల తరబడి తిరిగి అవస్థలు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలోనే విత్తనాలు, ఎరువులతో పాటు పంట కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ఇంతకంటే ఏమి కావాలి. అంతేగాక నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎంతో మేలు జరుగుతుంది.

– చౌడప్ప, బసినేపల్లి

సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నాం



రైతులందరికీ ఆర్బీకేల ద్వారా సకాలంలో ఎరువులు, విత్తనాలు, అందజేస్తున్నాం. విత్తన శుద్ధి, భూసారపరీక్షలతో పాటు పంటల ఎంపిక గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటలసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలిస్తున్నాం. వ్యవసాయశాఖ సిబ్బంది పొలాలకు వెళ్లి పంటలను పరిశీలించడమే గాకుండా సకాలంలో ఈ-క్రాప్ చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నారు.

– రవి, మండల వ్యవసాయ అధికారి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ల నిర్వహణలో భాగంగా వెల్దుర్తి, గోవర్ధనగిరి, చెర్లకొత్తూరు, కలుగొట్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. రామళ్లకోట సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని, మిగిలిన సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్ ఉదయం 5.30 నుంచి 9.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉంటుందని వెల్లడించారు.

18 వరకు రాజ్య పురస్కార్ శిబిరం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహార్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 18వ తేదీ వరకు రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు జరగనుంది. ఈ శిబిరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 9 నవోదయ విద్యాలయాల భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు 98 మంది హాజరయ్యారు. శుక్రవారం విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి ఆధ్వర్యంలో శిబిరం ప్రారంభోత్సవానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బీఆర్.బసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్ వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెపొందుతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు చేసే సేవా కార్యక్రమాల్లో భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు పాల్గొని సేవ చేయవచ్చునని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ చంధీరన్, స్కౌట్ మాస్టర్ నింబూరె, గైడ్ కెప్టెన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

ఆలూరు రూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రంగమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు త్వరగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. వేసవిలో కరెంటు కోతలు లేకుండా చూడాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. వైస్ ఎంపీపీ శ్రీరాములు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

సేవలకు సముచిత గౌరవం



మద్దికెరలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: సంక్షేమ వారధులు వలంటీర్లు అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక కమ్యునిటీ హాలులో మండల కన్వీనర్ ఆధ్వర్యంలో వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు కీలకమన్నారు. కులమతాలకతీతంగా రాజకీయ భేదం లేకుండా అన్ని వర్గాల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తూ వలంటీర్లు ప్రజల ఆదరణ పొందారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ పేరిట ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రజలకు గుర్తుండిపోయేలా ఏ ఒక్కపథకం అమలు చేయలేకపోయారన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు సైతం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు అదే పనిగా వలంటీర్లపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటివి పట్టించుకోకుండా సేవ చేసేందుకు ముందుండాలని సూచించారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, నాయకులు పక్కిరప్ప, సుబ్బయ్య, వెంకటేశులు, భద్రయ్య, ఆంజనేయులు, రామకృష్ణ, ఎంపీడీఓ అలివేలమ్మ, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల సమస్యలను పరిష్కరించాలి



మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగాల కులస్తులు

ఆలూరు: ఊరూరా తిరుగుతూ చిరువ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని బుడగ జంగాల కులస్తులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. మంత్రి జయరాం మాట్లాడుతూ.. బుడగజంగాల సమస్యలపై శాసన సభలో చర్చించామని, త్వరలోనే ఆ కులస్తులకు న్యాయం చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయండి

ఆలూరు: ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సీనియర్ నాయకులు కార్యకర్తలను సమాయత్తం చేయాలని, అందరికీ రవాణా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

దేవనకొండ: ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గంలో జరిగే 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధం కార్యక్రమానికి మండలం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ తపాల శ్రీనివాసులునాయుడు, పాలకుర్తి ప్రతాప్, వెలమకూరు రామచంద్ర, పల్లెదొడ్డి చంద్ర, ఉరుకుందు, లింగన్న, వెంకటస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.



దేవనకొండలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున

జాతరకు ముమ్మర ఏర్పాట్లు

హొళగుంద: ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్దేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతితో కలిసి ఆలయ పరిసరాలు, తేరుబజారులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, రథం సాఫీగా సాగేందుకు నేల చదును పనులు చేపట్టారు. ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు, ఇతర చెత్త చెదారాన్ని పొక్లెయినర్, ట్రాక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపు పనులు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చెల్లిస్తామని చెప్పారు. పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

శ్మశాన భూమి సర్వే

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు ప్రధాన రహదారి పక్కన ఉన్న హిందూ శ్మశాన వాటిక కబ్జాకు గురిఅవుతుండటంతో పరిరక్షణ కమిటీ సభ్యుల వినతి మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాలతో సర్వేయర్ నాగేంద్ర సర్వే నిర్వహించారు. శ్మశాన భూమిని పరిరక్షించుకొనేందుకు చర్యలు తీసుకొన్నట్లు కమిటీ నాయకులు గణేష్, రవిప్రసాద్, కొండయ్య,రంగన్న, వెంకటేష్,నాగరాజు, బీరప్ప తెలిపారు.

రేషన్ సక్రమంగా అందించాలి

హాలహర్వి: మండలంలోని బల్లోట గ్రామంలో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడంలేదనే సమాచారంతో శుక్రవారం గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించారు. సీపీఎం తాలూకా నాయకులు కేపీ నారాయణస్వామి, మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ బల్లోట గ్రామంలో గత నాలుగు నెలల నుంచి రేషన్ పంపిణీ సరిగా జరగడంలేదని, రేషన్ పంపిణీ పట్ల అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. అధికారులు చొరవ తీసుకుని సక్రమంగా రేషన్ పంపిణీ జరిగేలా చూడాలన్నారు. సీపీఎం నాయకులు షాకీర్, ఈరన్న, గోపాల్, గ్రామస్తులు ఉన్నారు.

నాటుసారా స్వాధీనం

కృష్ణగిరి: ఆలంకొండ గ్రామ శివారులోని బోయినాల చెరువు సమీపంలో శుక్రవారం 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేయగా గ్రామానికి చెందిన జుట్టు సుధాకర్‌కు చెందిన 350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు

తుగ్గలి: ప్రభుత్వం పల్లెలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని పగిడిరాయి పీహెచ్‌సీ వైద్యులు హరిత అన్నారు. శుక్రవారం చెన్నంపల్లిలో రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు హరిత, స్పెషలిస్టులు రాఘవనాయుడు, నితేశ్వర రెడ్డి, ఆప్తాలిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి దాదాపు 300 మందికి బీపీ, షుగరు, కంటి, రక్త, తదితర వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్ రంజాన్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ధ్యేయం అని ఎంపీడీఓ ఆజాద్, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ అన్నారు. శుక్రవారం హొళగుంద సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో హొళగుంద పీహెచ్‌సీ వైద్యాధికారులు న్యూటన్, బింధుమాధవి, కర్నూలు వైద్య నిపుణులు శివకేశవరెడ్డి, గైనాకాలజిస్ట్ సాయిజనప్రియ, కంటి వైద్యనిపుణులు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 450 మందిని పరీక్షించగా 10 మందిని మెరుగైన వైద్యం కోసం రేఫర్ చేసినట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు.

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి-1 సచివాలయం పరిధిలో శుక్రవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు రవి, గైనకాలజిస్ట్ గాయత్రి ఆధ్వర్యంలో 512 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని చింతకుంట సచివాలయం-2 పరిధిలో వైద్యులు గంగాధర్, అలేఖ్య, లీలావతి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చెన్నంపల్లి శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



మొలగవల్లిలో వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను గుర్తించండి

ఎమ్మిగనూరురూరల్: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే గుర్తించాలని తహసీల్దార్ శేషారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల సెక్టోరల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, పోలీసులు తమకు కేటాయించిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చూడాలని చెప్పారు. ప్రతి అధికారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గోనెగండ్ల, నందవరం తహసీల్దార్లు భూపతిపార్వతి, ఓబులేసు, ఎన్నికల డీటీ గురు రాజారావు, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

వైభవంగా రంగనాథుడి కల్యాణోత్సవం

మద్దికెర: పెరవలి గ్రామంలో శుక్రవారం రథసప్తమి పురస్కరించుకొని శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రదక్షిణలు చేసి బిందెసేవ, అష్టోత్తరనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణమండపంలో కొలువుతీరిన స్వామివార్లకు వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తాదుల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం రథసప్తమి కోసం ప్రత్యేకంగా తయారుచేయించిన సూర్యప్రభపై గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

చిప్పగిరి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మూడు గడ్డివాములు కాలిబూడిదైన సంఘటన మండలంలోని ఏరూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నరసింహులు, అనిల్ పశువుల మేత కోసం కల్లంలో గడ్డివాములు వేసుకున్నారు. శుక్రవారం గడ్డివాములకు నిప్పంటుకోవడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వాహనంతో వచ్చి నీటిని చల్లి మంటలను అదుపుచేశారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు
70750 09147 (ఎమ్మిగనూరు),
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com